నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 1-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 134 | పేజీలు: 4 | వెల: రూ.1/-

టీఆర్ఎస్ మున్సిపల్ వ్యూహాలు

సన్నాహక సమావేశాలతో ఎన్నికల వేడి

కార్యకర్తలతో భేటీల్లో దిశానిర్దేశం

హైదరాబాద్,డిసెంబర్31 (ఆర్ఎన్ఎ): త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో టిఆర్ఎస్ సన్నాహక సమావేశాలతో రాజకీయ వేడి పుట్టిస్తోంది. విపక్షాల కంటే ముందుగానే ప్రచాహోరు సాగిస్తోంది. టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. కార్యకర్తలు ఈ సమావేశాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్‌లో జరిగిన కార్యకర్తల సమావేశానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు .కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు హాజరై ప్రసంగించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ విజయబావుటా ఎగురవేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్ఎస్ బలంగా ఉన్న విషయం అందరికే తెలిసిందే. కాగా నిర్లక్ష్యం వహించకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులు తెలియజేశారు. రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశానికి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ యాజరయ్యారు.

హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు..

హైదరాబాద్, డిసెంబర్ 31 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 2 గంటల వరకు హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ తెలిపారు. ఎన్టీఆర్‌మార్గ్, నెక్లెస్ రోడ్డు, అప్పర్ ట్యాంక్‌బండ్‌పై వెళ్లే వాహనదారులు ఆంక్షల సమయంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. అందుకు ఆయా రూట్లలో వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు వివరించారు. బేగంపేట్ రూట్ ఫ్లై ఓవర్లు మినహా నగరంలోని మిగతావన్నీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మూసివేస్తున్నట్లు సీపీ తెలిపారు. 1వ తేదీ తెల్లవారుజాము 2 గంటల వరకు బస్సులు, లారీలు ఇతర భారీ వాహనాలకు నగరంలోకి అనుమతి లేదన్నారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, అతి వేగం, త్రిబుల్ రైడింగ్ ఉల్లంఘనలను సీరియస్‌గా తీసుకుంటునామని, వీటిని అడ్డుకోవడం కోసం ప్రత్యేక తనిఖీలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నూతన సంవత్సర వేడుకలను ఇన్సిండెంట్ ఫ్రీగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారని, వాహనదారులు కూడా పోలీసులకు సహకరించి ప్రమాద రహితంగా సంబురాలు చేసుకోవాలని పిలుపునిచ్చారు. డ్రంక్ డ్రైవ్ తనిఖీల కోసం ప్రత్యేకంగా 50 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము వరకు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగుతుంది. నగర వ్యాప్తంగా సుమారు 100 బృందాలు ఈ తనిఖీలో పాల్గొంటున్నాయి.

ట్రాఫిక్ మళ్లింపు..

– నెక్లెస్‌రోడ్డు, ఎన్టీఆర్‌మార్గ్ వైపునకు వచ్చే వాహనాలను ఖైరతాబాద్, రాజ్‌భవన్ వైపు మళ్లిస్తారు.

–బీఆర్‌కే భవన్ నుంచి ఎన్టీఆర్‌మార్గ్ వైపు వచ్చే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ వద్ద ఇక్బాల్ మినార్, లక్డీకపూల్ వైపు..

–లిబర్టీ నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్‌కు వచ్చే వాహనాలను జీహెచ్ఎంసీ వై జంక్షన్ నుంచి బీఆర్‌కే భవన్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్, ఇక్బాల్ మినార్ వైపు..

–ఖైరతాబాద్ మార్కెట్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వచ్చే వాహనాలను ఖైరతాబాద్(బడా గణేష్) వద్ద సెన్‌సేషన్ థియేటర్, రాజదూత్‌లైన్‌కి మళ్లిస్తారు.

–మింట్‌కంపౌండ్ నుంచి సచివాలయం వెళ్లే లైన్‌లోకి సాధారణ వాహనదారులకు అనుమతి ఉండదు. ఈ రోడ్డు మూసేస్తారు.

–నల్లగుట్ట రైల్వే బ్రిడ్జి నుంచి సంజీవయ్య పార్కు, నెక్లెస్ రోడ్డు వైపు వాహనాలకు అనుమతి ఉండదు, ఈ వాహనాలను కర్బాల మైదాన్, మినిస్టర్ రోడ్డుకి మళ్లిస్తారు.

– సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను షెయిలింగ్ క్లబ్ వద్ద కవాడిగూడ క్రాస్‌రోడ్డు వైపు మళ్లిస్తారు.

పురపాలికల్లో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

హైదరాబాద్,డిసెంబర్31 (ఆర్ఎన్ఎ): ప్లాస్టిక్ రహిత పట్టణాల కోసం ప్రతి ఒక్కరూ ప్రతిన చేయాలని రాష్ట్ర పురపాలకశాఖ సంచాలకులు శ్రీదేవి అభిలషించారు. కొత్త ఏడాది అంతా ప్లాస్టక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. ప్లాస్టిక్ నిజజీవితంలో మనతో మమేకమైనా దానిని దూరం చేయకుంటే ఎన్నో అనర్థాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ జనపనార సంచులు ఉపయోగించేలా చూడాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్లాస్టిక్ వాడకం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అన్ని పురపాలికలు, నగర పంచాయతీల్లో కొత్త ఏడాది నుంచి ప్లాస్టిక్ కవర్లు, అనవసర కటౌట్లతో పాటు ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధిస్తున్నట్లు ఆదేశించారు. పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలను పూర్తిగా నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీగా అపరాధ రుసుం విధిం చాలని ఆదేశించారు. ఇప్పటికే పలు మున్సిపాలిటిల్లో వాడకాన్ని తగ్గించగలిగామని అన్నారు. విద్యార్థులు, పుర పాలకమండలి, సిబ్బందితో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు.

న్యూఇయర్ ఎఫెక్ట్..ఐటీ కారిడార్ లో ఫ్లైఓవర్లు బంద్

హైదరాబాద్,డిసెంబర్31 (ఆర్ఎన్ఎ): నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మాదాపూర్ ఐటీ కారిడార్‌లోని పైవంతెనలు మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. సైబర్ టవర్స్, మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ, గచ్చిబౌలిఫ్లై ఓల్గ÷వర్లను మంగళవారం తేదీ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల వరకు మూసివేస్తున్నట్లు ప్రకటించారు. వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా వీటిని మూసివేస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్యాబ్ రైడ్‌లను తిరస్కరిస్తే చట్టపరమైన తీసుకుంటామని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో 9490 617346 నంబర్‌కు వాట్సప్ ద్వారా సందేశాలు పంపించాలని సూచించారు.

ఉప్పల్ చౌరస్తాలో ఘోర రోడ్డు ప్రమాదం

స్కూల్ విద్యార్థుల ఆటోను ఢీకొట్టిన లారీ

విద్యార్థి మృతి

ఐదుగురికి గాయాలు

క్షతగాత్రులకు స్థానికి ఆస్పత్రిలో చికిత్స

ప్రమాద కారకుడైన లారీ డ్రైవర్ పరార్

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూలు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూలుకు వెళ్తున్న విద్యార్థుల ఆటోను ఇసుక లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలోని ఓ విద్యార్థి అక్కడికక్కడే మరణించాడు. మరో ఐదుగురికి గాయాలు కాగా, వారిని హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు.

ఆటోలో ఉన్న మరో ఇద్దరు విద్యార్థులు క్షేమంగా ఉన్నారు. ఉప్పల్–హబ్సీగూడ మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం ధాటికి చిన్నారి లారీ కింద పడిపోయి, అక్కడిక్కడే మృతి చెందాడు. ఉప్పల్ కి చెందిన ఏడవ క్లాస్ విద్యార్థి అవంత్ కుమార్(12) అనే విద్యార్థి తలబాగం నుజ్జు నుజ్జు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోని మరో ఏడుగురు స్కూల్ విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రయివేట్ హాస్పత్రికి తరలించారు. ఇసుక లారీ ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ప్రమాద సమయంలో ఆటోలో 10 మంది విద్యార్థులు ఉన్నారు. ఢీకొన్న వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. రోడ్డు మధ్యలో ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు, క్షతగాత్రులను స్థానికులు సాయంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రద్దీగల రోడ్డుపై మితిమీరిన వేగంతో లారీ నడుపుతూ, ఆటోను చూసుకోకుండా ఢీకొట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. లారీ ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొట్టడం, అందులోని విద్యార్థులు రోడ్డుపై పడిపోవడం, వారిపై నుంచి లారీ వెళ్లడం రెప్పపాటులో జరిగాయని స్థానికులు తెలిపారు. ఈ దారుణ ఘటనతో తల్లిదండ్రులు ఆవేదన చెందుతూ దుర్ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమ చిన్నారులు మరణించడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటుతున్నాయి. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

టీఆర్ఎస్‌లో మున్సిపల్ ఎన్నికల జోష్

నయాసాల్‌లో గెలుపు లక్ష్యంగా ప్రణాళిక

కేటీఆర్ ఆదేశాలతో నేతల కార్యాచరణ

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): కొత్త ఏడాది రావడంతోనే టిఆర్ఎస్‌లో మున్సిపల్ ఎన్నికల సందడి మొదలయ్యింది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో నేతలు జోష్‌లో ఉన్నారు.

ఇటీవల మంత్రి కెటిఆర్ తెలంగాణ భవన్‌లో సమీక్షించి దిశానిర్దేశం చేయడంతో పట్టణాల్లో ఎన్నికల హోష్ కనిపిస్తోంది.

ఇతరపార్టీలతో పోలిస్తే టిఆర్ఎస్‌లో ఉత్సాహం కొట్టిచ్చినట్లు కనిపిస్తోంది. ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం ఉందని, పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై విశ్వాసం ఉందని పేర్కొంటూనే ఈ మంచి వాతావరణాన్ని విస్తృతంగా మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కెటిఆర్ పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో టీఆర్ఎస్ తప్ప మరేపార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని అన్నారు. పార్టీ శ్రేణులు కలిసికట్టుగా అందరినీ కలుపుకొని పోయేలా వ్యవహరించాలని ఆయన సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్ గెలుపును ఆపే శక్తి ఏ పార్టీకి లేదని ఆయన పేర్కొంటూ గులాబీ విజయం పునరావృతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే జిల్లా ప్రజాప్రతినిధులతో సమాలోచ నలు జరిపారు. కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపికలో చైర్మన్ల ఖరారులో టీఆర్ఎస్ అదిష్ఠానం ప్రకటనే తుది నిర్ణయమన్నారు. గెలుపు అవకాశాలు ఖచ్చితంగా ఉంటున్నందున టీఆర్ఎస్‌లో సీట్ల కోసం పోటీ ఉంటుందని అసమ్మతి లేకుండా చూసుకొవాలన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ ఉండాలని ఇందుకోసం పక్కా వ్యూహాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు. మున్సిపాలిటీల వారీగా పార్టీ వ్యూహం, పార్టీలో నాయకత్వం, కార్యకర్తల మనోగతం, ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి వంటి కీలకమైన అంశాలపై చర్చించారు. ప్రతీ వార్డుకు 50 నుంచి 100 మంది ముఖ్యకార్యకర్తలను గుర్తించాలని, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యాక వార్డుకు ఆ రిజరేషన్ ప్రాతిపదికన ముగ్గురిచొప్పున జాబితా రూపొందించాలని ఆయన సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో అన్ని కౌన్సిలర్ స్థానాల్లో టీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కార్యకర్తలను, నేతలను కలుపుకొని వార్డుల వారిగా పక్కా ప్రణాళికతో గెలుపు కోసం ప్రయత్నించాలని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వరుసగా గత ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం అవుతాయన్నారు. ప్రతి వార్డులో టీఆర్ఎస్ అభ్యర్థి గెలిచేలా వ్యూహంపండాలని సూచించారు. వార్డుల వారిగా పరిస్థితులను అంచనా వేయలన్నారు. దీనికి అనుగుణంగా వ్యూహం అమలు చేయాలన్నారు. ఎంపీపీలను, జడ్పీటీసీలను వార్డుల ఇంచార్జీలుగా నియమించాలన్నారు. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత ప్రతి ముగ్గురు చొప్పున తయారు చేయాలన్నారు. నామినేషన్ దాఖలు పక్రియలోపు కార్యకర్తల సమావేశాలను ఇంచార్జీలుగా నియమించి వీరి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలన్నారు. గెలుపు ప్రాతిపదికగా అభ్యర్థుల ఎంపికగా ఉండాలన్నారు. గెలుపు అవకాశాలను ప్రమాణికంగా తీసుకోవాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను అందరికి వివరించాలన్నారు. వార్డుల వారిగా చేపట్టిన పనులను, చేపట్టబోయే పనుల వివరాలతో ప్రగతి నివేదికలు రూపొందించి ప్రజలకు తెలియజేయాలన్నారు.

ఆర్మీచీఫ్‌గా నరవణెళి బాధ్యతల స్వీకరణ

నూతన ఆర్మీ చీఫ్‌గా బిపిన్ రావత్ నుంచి బాధ్యతలు స్వీకరించిన లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె.

న్యూఢిల్లీ, డిసెంబర్31(ఆర్ఎన్ఎ) : భారత ఆర్మీకి నూతన సైన్యాధిపతిగా లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణెళి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. బిపిన్ రావత్ స్థానంలో సైన్యాధిపతిగా జనరల్ నరవణెళి బాధ్యతలు స్వీకరించారు. భారత ఆర్మీకి నరవణెళి 28వ సైన్యాధిపతి. జనరల్ మనోజ్ ముకుంద్ తన 37 సంవత్సరాల సర్వీసులో వివిధ బాధ్యతలను నిర్వహించారు. శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్ లో కూడా మనోజ్ ముకుంద్ ఒకడిగా పనిచేశారు. లెఫ్టినెంట్ జనరల్ నరవణెళి.. మహారాష్ట్రకు చెందిన వ్యక్తి. పుణెలోని జనన ప్రబోధిని పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఉన్నత విద్యను పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలటరీ అకాడమీలో పూర్తి చేశారు. డిఫెన్స్ స్టడీస్‌లో మాస్టర్స్ డిగ్రీని చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఇండోర్‌లోని దేవీ అహిల్య విశ్వవిద్యాలయంలో డిఫెన్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఎంఫిల్ చేశారు. 1980లో తొలి సారిగా సిఖ్ లైట్ ఇన్‌ఫాంట్రీ ఏడో బెటాలియన్‌లో నరవణెళి నియామకం అయ్యారు. జమ్మూకశ్మీర్‌లోని రాష్ట్రీయ రైఫిల్‌లో కమాండెంట్‌గా, అసోం రైఫిల్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా జనరల్‌గా నరవణెళి సేవలందించారు. చైనాతో 4000 కిలోమీటర్ల సరిహద్దు గల ప్రాంతాన్ని రక్షించే ఈస్టెర్న్ కమాండ్ అధిపతిగా, శ్రీలంకలో ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్నేనూ, మయన్మార్లోని భారత రాయబార కార్యాలయంలోనూ బాధ్యతలు నిర్వహిం చారు. 2019 సెప్టెంబర్ ఒకటో తేదీన ఆర్మీ వైస్ ఛీఫ్‌గా నరవణెళి నియామకం అయ్యారు. ఆయన అందించిన సేవలకు గాను విశిష్ట్ సేవా మెడల్, అతి విశిష్ట్ సేవా మెడల్‌లు నారావణెళిను వరించాయి. ఆయన భార్య వీణా నరవణెళి టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాంగ్రెస్‌ను అవమానించిన సిపి అంజన్‌కుమార్

ఆవిర్భావం రోజు కార్యకర్తల అరెస్టు

గవర్నర్ తమిళ సైకి కాంగ్రెస్ బృందం ఫిర్యాదు

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో శాంతిభద్రతలు పూర్తిస్తాయిలో అదుపులో ఉన్నా, కాంగ్రెస్ అవిర్భావం రోజు తమ కార్యకర్తలను అరెస్ట్ చేసి అవమానపరిచారని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన శాంతి యాత్రకు అనుమతించకపోవడంపై కాంగ్రెస్ బృందం గవర్నర్ తమిళ సై దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా గాంధీభవన్‌లో 135వ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలను గాంధీభవన్‌కు రాకుండా అడ్డుకోవడం, అరెస్టులు చేయడం వంటి అంశాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసారు. ఆ సమయంలో హైదరాబాద్ సిపి అంజనీ కుమార్ తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోన్ చేస్తే సరిగా స్పందిచకపోగా అనుచితంగా ప్రవర్తించడంపై గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలంగాణ విభజన చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం శాంతి భద్రతల అంశంలో గవర్నర్‌కు ఉన్న అధికారాలను వినియోగించాలని తమిళిసైను కాంగ్రెస్ నాయకులు కోరారు. ఉత్తమ్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు రాష్ట్ర గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌పై పోలీసులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, ఎంఐఎం సభలకు అనుమతి ఇచ్చి.. కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీని అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. అంతేకాదు.. సీపీ అంజనీకుమార్ ఫోన్‌లో తనతో దురుసుగా మాట్లాడారని గవర్నర్‌కు ఉత్తమ్ ఫిర్యాదు చేశారు. కాగా, కొద్దిరోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ చేపట్టదలచిన ర్యాలీకి సీపీ అంజనీకుమార్ అనుమతివ్వలేదు. దీంతో ఆర్ఎస్ఎస్, ఎంఐఎం సభలకు అనుమతి చ్చిన పోలీసులు.. తాము శాంతియుతంగా ర్యాలీ చేపడతామంటే అనుమతి ఎందుకివ్వలేదని పోలీసు ఉన్నతాధికారులను ఉత్తమ్ ప్రశ్నించారు. గవర్నర్‌ను కలసిన వారిలో శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి, విహెచ్ తదితరులు ఉన్నారు.

కార్చిచ్చు ధాటికి.. బీచ్‌వైపు జనం పరుగులు

హైదరాబాద్, డిసెంబర్ 31:: ఆస్ట్రేలియాలో కార్చిచ్చు దహించివేస్తున్నది. మంటలు వ్యాపిస్తున్న తీరు విక్టోరియా నగర ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దావానలాన్ని తట్టుకోలేని ప్రజలు.. సముద్ర తీరం దిశగా పరుగులు తీస్తున్నారు. ఆకాశం అంతా ఎర్రగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. న్యూసౌత్ వేల్స్‌లో ఇద్దరు మృతిచెందినట్లు అధికారులు చెప్పారు. కార్చిచ్చు వల్ల ఆస్ట్రేలియా మరణించిన వారి సంఖ్య 12కు చేరుకున్నది. విక్టోరియాలో నలుగురు ఆచూకీ లేకుండాపోయారు. సుమారు నాలుగు వేల మంది విక్టోరియా బీచ్ వద్ద తలదాచుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఉప్పల్ ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థులు క్షేమం

ప్రమాదం లేదని ప్రకటించిన వైద్యులు

ఉప్పల్ పోలీస్ స్టేషన్ ముందు అవంత్ బంధువుల ఆందోళన

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): ఉప్పల్‌లో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు ప్రకటించారు.

ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఐదుగురు విద్యార్థుల్ని తమ ఆస్పత్రిలో చేర్చారని, అందులో ముగ్గురికి ప్రాథమిక చికిత్స అందించి డిశ్చార్జ్ చేశామని ఉప్పల్ ఆదిత్య ఆస్పత్రి డాక్టర్ బాలాజీ తెలిపారు. గాయపడిన మిగతా ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి భుజానికి గాయమైందని, అతన్ని రెండురోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు. మరో విద్యార్థి జనరల్ వార్డులో ఉన్నాడని, సాయంత్రం అతన్ని డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతిచెందగా.. ఏడుగురు గాయపడిన సంగతి తెలిసిందే. విద్యార్థులతో స్కూల్ కి వెళ్తున్న ఆటోను వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇక, ప్రమాదంలో మృతిచెందిన అవంత్‌కుమార్ తల్లిదండ్రులు, బంధువులు ఉప్పల్ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు కారణమైన లారీ డ్రైవర్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకోగా.. లారీ ఓనర్‌ను కూడా అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నో పర్మిట్ సమయంలో లారీలు తిరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని వారు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తన కొడుకు మృతితో అవంత్ తల్లిదండ్రులు గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. తన కొడుకు చాలా తెలివైనవాడని, ఉన్నత చదువులు చదవాలని అనుకున్నాడని తండ్రి సంతోష్ కన్నీరుమున్నీరవుతూ మీడియాకు తెలిపారు. ఈ దారుణమైన రోడ్డుప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

చరిత్రలో నేటినిజం

కం॥ ముత్యాము లవంటి భోతిక
సత్యాము లను జెప్పినట్టి ఆస్త్రజ్ఞుండౌ
సత్యేంద్ర నాథ బోసుకు
నత్యాప్తుం డించు చుండు నీరాజనములే!!

(జనవరి 1 సత్యేంద్రనాథ బోస్ జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

జవహర్ నగర్‌లో 50 తులాల బంగారం చోరీ

హైదరాబాద్ , డిసెంబర్ 31: జవహర్ నగర్ మైత్రీ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న స్థిరాస్తి వ్యాపారి నర్సింగ్‌రావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. నిన్న రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు.. 50 తులాల బంగారు నగలు, 5 కిలోల వెండితో పాటు నగదును దుండగులు అపహరించారు. బాధిత కుటుంబం నిన్న రాత్రి యాదాద్రి లక్ష్మీనరసింహాస్వామి దర్శనానికి వెళ్లింది. ఈ సమయంలోనే దొంగలు చోరీ చేశారు. నర్సింగరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చోరీ జరిగిన నివాసాన్ని పోలీసులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

త్యాగరాయ గాన సభ అధ్వర్యం లో కల సుబ్బా రావు వేదిక పై నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న వకుళాభరణం కృష్ణ మోహన్ , కళా వి ఎస్ జనార్దన్ మూర్తి ,లయన్ విజయ్ కుమార్ ,బండి శ్రీనివాస్ , అర్చన వెంకటేశ్వర్ రావు తదితరులు .....

అందరూ ఆనందంగా వుండాలని కోరుకుందాం..!!

నేటినిజం
బుధవారం 1-1-2020

శ్రీకృష్ణుడు గీతామృతాన్ని బోధించినా, గౌతమబుద్ధుడు ధర్మచక్ర ప్రవర్తన ప్రారంభించినా, అశోకుడు కారుణ్య సిద్ధాంతాన్ని ప్రపంచానికి చాటినా, యేసుక్రీస్తు పర్వతాగ్రంపై నిలిచి ధర్మబోధ చేసినా అందరి లక్ష్యం మానవులలో మార్పును. మంచిని అవలంబింపచేయాలనే... అలాంటి మహనీయుల లక్ష్యాలన్నీ కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేసి తమతమ సొంత లాభం వెదుక్కునే దారిలో పడ్డారీ పాలకులు...ఆకలిగొన్న జాతికి నీతిబోధలు తలకెక్కవు.. అన్నానికి, అక్షరానికి, ఆరోగ్యానికి, అంతా నాదే అనుకుంటూ తన్నుకోవడానికి ఏ మూల వెదికినా మనదేశంలో ఏమాత్రం కొరతలేదు. మొన్నటిదాకా ఓట్లకోసమైనా దేశంలో దరిద్ర్యాన్ని పారదోలుతున్నట్లు నటించిన పాలకులు నేడు దేశంలో దారిద్ర్యాన్ని ఎంతగా పెంచితే అంత మేలనే దృష్టిలో వున్నట్లున్నారు. మాడు పగిలిపోతున్న ధరలు, విరుచుకుపడిన వరదలు, ముద్దదొరకనంత కరువు, గుండెల్ని పిండిచేస్తున్న ఆర్థిక మాంద్యం, దేశం నలుమూలలా వ్యాధుల విహారాలు, ఈ ఏడాదైతే అంటూ ఏ ఏడాదికి ఆ ఏడాదే గజ గజ లాడిస్తున్నాయి. బతుకులన్నీ పాత బట్టల మూటలా ముతకవాసన కొట్టుకుంటూ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే జనజీవనాన్ని నలిపి నలిపి ఆకారంలేకుండా ముద్దచేస్తున్న ఈ సమస్యలన్నింటి వెనుక పేరుకుపోయిన నేతల నిర్లక్ష్యమే కారణమవుతోంది. సంవత్సరాలు గడిచిపోతున్నాయి.. జనం ఏడవలేక నవ్వుతూ చేతులో వున్న కాస్తంత ఆదాయాన్ని మొదటిరోజు సంబరాలకోసం వెచ్చిస్తూ, ఓపిక లేకున్నా పాతబట్టల్నే మళ్ళీ మళ్ళీ ఇస్త్రీ మడతలతో వేసుకుని ఎగరలేకున్నా ఎగురుతూ వారి అలవాట్లలో, ఆచారాలతో, ఆలోచనలలో, ఆదర్శాలలో ఏమాత్రం మార్పురాకున్నా మార్పు వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు..ఆకలి, దారిద్ర్యం, దైన్యం, తప్ప ఈ శకం కనుచూపుమేరలో ఏమీ కనబడటంలేదు.. రేపటి ఉదయం మీద నమ్మకం వుంటే తప్ప నేటి సాయం సంధ్యను ఆస్వాదించలేము. అలాగే రేపటి వెలుగులు కంటిముందైనా కనబడితేనే ఈరోజుటి ఆనందానికి అర్థముంటుంది.. యావత్‌జాతి జీవితంలో ఓ ఏడాదికాలం మహా సాగరంలో ఒక నీటిబొట్టుకు సమానం. నిన్నమొన్నటివరకు మనకు ఎదురైన, మనకు మనమే సృష్టించుకున్న ఆవేదనలను, పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకుపోతేనే జీవితం జీవితంలానైనా మిగులుతుంది.. లేకుంటే పొరపాట్లనే ఒక ఒరవడిగా సృష్టించుకుంటూ పోతే మనం చనిపోవడానికి కూడా మిగలమేమో అనిపిస్తుంది.. మనది కాని డబ్బుకోసం నీతిని,నిజాయితీని వేలపాట పాడుతూ, గడిపే జీవితంకూడా ఒక జీవితమేనా అని ఆలోచించాల్సిన అవసరం మనకువుంది.. ఇందుకు ప్రభుత్వం అవసరంలేదు. ఆధ్యాత్మితతత్వం అలవరుచుకోవడమే అందుకు సరైన మార్గం.. ఆ మార్గమే మనకు సరైన నాయకత్వాన్ని తెచ్చిపెడుతుంది.. సరైన భావితరాన్ని తయారుచేయిస్తుంది.. ఉన్నదాంట్లో జీవితం ప్రశాంతంగా ఉండేలా చేస్తుంది.. .. అందరూ ఆనందంగా వుండాలని కోరుకుందాం..!! నూతన ఆంగ్ల సంవత్సరాదిని ఆహ్వానిద్దాం..!

గ్రామాల దిశ మార్చే పల్లె ప్రగతి

ప్రజలంతా సహకరించాలి
అధికారులు నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలి
మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): ప్రతి గ్రామాన్ని ప్రగతి దిశగా తీసుకుపోయేందుకే మరోమారు పల్లె ప్రగతి కార్యక్రమాన్నిచేపట్టామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమం తొలిదశతో గ్రామాల రూపురేఖలు మారాయని, కొత్త సంవత్సరంలో 2వ తేదీనుంచి చేపడుతున్న ఈ కార్యక్రమంలో గ్రామ సమస్యలకు పరిష్కారం చూపబోతున్నామని అన్నారు. రెండవ విడుత పల్లె ప్రగతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులకు సూచించారు. జనవరి 2వ తేదీన నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో రెండవ విడుత నిర్వహించనున్న పల్లె ప్రగతి కార్యక్రమంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఇందుకోసం జిల్లా, గ్రామ స్థాయిలో సమావేశాలు పూర్తి చేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.339 కోట్లు విడుదల చేస్తున్నామని చెప్పారు. పల్లె ప్రగతిలో యువకులు, మహిళలు, పెన్షనర్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అలాగే, పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరి గ్రామాలను వారు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు స్ఫూర్తి తీసుకుని రావాలన్నారు. గ్రామాలలో నర్సరీల పెంపకం, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులకు స్థలాల సేకరణ, మొక్కల సంరక్షణ, శిథిలావస్థలో ఉన్న భవనాల భవనాల తొలగింపు, పాత బావుల పూడికతీత, తడి-పొడి చెత్త సేకరణకు చెత్తబుట్టల పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్లలె ప్రగతి పనుల పరిశీలన కోసం ప్లెయింగ్ స్కాడ్ అధికారులను నియమించాలని సూచించారు. వారు ప్రతి మండలంలోని రెండు

గ్రామ పంచాయతీలలో జరిగే పనుల పురోగతి , నాణ్యత కార్యక్రమాలను పరిశీలిస్తారని తెలిపారు. ఆయా మండలాల్లో ప్లలె ప్రగతి కార్యక్రమాల అమలు, గ్రామాలకు చేకూరిన లబ్దిని అంచనా వేసి పంచాయతీరాజ్ శాఖ రూపొందించే మొబైల్ యాప్‌లలో డాటాను నమోదు చేయాలన్నారు. రెండవ విడుత పల్లె ప్రగతిలో ఒక రోజు శ్రమదానానికి కేటాయించాలన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామానికి సంబంధించిన వార్షిక ప్రణాళికతోపాటు ఐదేండ్ల ప్రణాళికను రూపొందించాలని తెలిపారు.

దరఖాస్తులు పెండింగ్ పెట్టొద్దు..ఫిర్యాదుల్ని పరిష్కరించాలి

హైదరాబాద్,డిసెంబర31: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రవి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ లేదని, దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావుతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఉపాధి, రుణాలు, ఇండ్లు, పింఛన్లు తదితర అంశాలపై సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో పది ఫిర్యాదులు వచ్చాయని, వాటి ని వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా జేసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మెహిదీపట్నం జహందార్‌నగర్‌కు చెందిన ఎండీ కరామత్ ఆలీ వయోవృద్ధుల పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సం బంధిత అధికారులు పరిశీలించాలని జేసీ సూచించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను కాంట్రాక్ట్ బేసి క్ కింద దివ్యాంగులను భర్తీ, ప్రభుత్వం అందజేస్తున్న డబు ల్ బెడ్‌రూం ఇళ్లలో దివ్యాంగులకు మం జూరు చేయాలని వికలాంగుల హక్కుల వేదిక ప్రెసిడెంట్ నాగేశ్వరరావు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సభావత్ శ్రీను, రాజాగౌడ్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకట నర్సమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారి విమల దేవి, వికలాంగుల సంక్షేమ శాఖాధికారి పుష్పలత, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో 47 ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా: ప్రజావాణికి 47 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా రెవెన్యూ అధికారి ఉషారాణి ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రుణ మాఫీ, రుణ మంజూరు, భూ సమస్యలు, ఆహార భద్రతా కార్డు, తదితర సమస్యలపై 47 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

3న సావిత్రీబాయి పూలే జయంతి

ఆదిబాలాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): జనవరి 3న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను జరుపనున్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు జ్ఞానజ్యోతి సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల్ని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని అఖిల భారతీయ మాలీ మహాసంఘం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకమార్ పేట్కులే కోరారు. కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు.

కన్నీరు తుడిచిన గోదారమ్మ: లోక

కరీంనగర్,డిసెంబర్31(నేటినిజం ప్రతినిధి): మెట్టప్రాంత రైతులు కరువుతో తల్లడిల్లుతుంటే గోదావరి నీళ్లను తీసుకొచ్చి కష్టాలు తీర్చి అన్నదాతల మొముల్లో ఆనందం నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి కొనియాడారు. ఎల్లంపెల్లి ఎత్తిపోతల నీళ్లు చేరుకోవడంతో కథలాపూర్ మండలం తాండ్యాల్ర, ఇప్పపెల్లి గ్రామాల్లోని చె రువులు జలకళను సంతరించుకున్నాయి. కథలాపూర్ మండలానికి ఓ వైపు కాళేశ్వరం నీళ్లు, మరోవైపు ఎల్లంపల్లి ఎ త్తిపోతల ద్వారా సూరమ్మ రిజర్వాయర్ నీళ్లు వస్తుండడంతో రైతుల్లో సంతోషం వెల్లివిరుస్తున్నదన్నారు. చెరువులు జలకళ సంతరించుకోవడంతో అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడిన రైతాంగానికి ఎంతో ఊరట లభిస్తున్నదన్నారు. అధికారంలోకి రాగానే రైతుల ముఖంలో సంతోషం నింపడమే లక్ష్యమని ప్రకటించిన సీఎం కేసీఆర్ ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. సబ్సిడీపై పరికరాలు, పంటలకు మద్దతు ధర కల్పిస్తూ అన్నివిధాల అండగా ఉంటున్నారన్నా రు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నాయని, వారిని గమనించాలని సూచించారు.

కొత్త ఏడాదిలో జలసిరి

హైదరాబాద్, డిసెంబర్ 31:కోటి ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా చేపట్టిన ప్రాజెక్టుల్లో ప్రధానమైన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తికి సిఎం కెసిర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. గతేడాది కొత్త సంవత్సరం తొలి రోజునే నీటి పారుదల ప్రాజెక్టుల బాటపట్టారు. ఇదే సందర్భంలో తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని సీఎం కేసీఆర్ కోరారు. మరోవైపు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి నీరందించాలని భావిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్ట్ పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వయంగా పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకుంటున్నారు. అనుకున్న లక్ష్యం నెరవేరుతోంది. కాళేశ్వరంతో కలలు సాకారం అవుతున్నాయి. నీటిని ఒడిసిపట్టడం ద్వారా గోదారమ్మను తెలంగాణ పల్లెలకు పారించాలన్న కలలు నెరవేరుతున్న తరుణంలో సిఎం కెసిఆర్ మరింత భరోసాగా ఉన్నారు. గతేడాది కాళేశ్వరం పనులను పరిశీలించి, పనులను పరుగెత్తేలా చేసిన సిఎం ఇప్పుడు ప్రాజెక్టుల పనితీరుపై ధీమాగా ఉన్నారు. 2019 ముగుస్తున్న వేళ సోమవారం ఆయన మిడ్‌మానేరు సందర్శించి హృదయపూర్వక సంతోషం వ్యక్తం చేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టుపై నిలబడి పూజచేస్తున్నప్పుడు చాలా ఆనందమేసింది. జీవితంలో గొప్ప సఫలత్వం సాధించిన భావన కలిగింది. ఇంత పెద్ద గోదావరి.. సూమారు 46 మంచి వాగులు ఉండి కూడా ఈ జిల్లా కరువు కాటకాలకు నిలయమైంది. దుబాయి, బొంబాయికి ప్రజలు వలస పోయారు. 700 నుంచి 900 అడుగులకు బోర్లువేసే పరిస్థితి. కరీంనగర్ జిల్లా ప్రజలు గొప్పవాళ్లు. 2001 సింహగర్జన నుంచి నేటివరకు తెలంగాణ ఆత్మగౌరవ బావుటా ఎగురవేయడంలో ఎప్పుడూ ప్రథమ పంక్తిలో ఉన్న ఈ జిల్లాలో ఇంత అద్భుతమైన నీటి సదుపాయం కలుగటం చాలా సంతృప్తి కల్గిస్తున్న విషయం. అందుకే దీన్ని స్వయంగా చూడాలని వచ్చాను. చాలా గొప్ప సంతోషంతో తిరిగి వెళుతున్నాని చేసిన ప్రకటన ఒకింత స్ఫూర్తిని ఇచ్చే అంశంగా చూడాలి. గోదావరి కిందకుపోతున్న వేళ దానిని ఒడిసిపట్టి పైకి తీసుకుని వచ్చే ప్రయత్నంలో భగరీథ యత్నం సాగుతోంది.ఒక్కో ప్రాజెక్ట్ పూర్తవుతుంటే నిజంగానే తెలంగాణ సస్యశ్యామలం కావడంలో ఆశ్చర్యం ఉండదు. ప్రాజెక్టులు సాకారం అయితే అంతకు మించిన ఆనందం పాలకుడిగా కెసిఆర్‌కు ఎక్కువగానే ఉంటుంది. రీంనగర్ జిల్లాకు లక్ష్మి, సరస్వతి, పార్వతి బరాజ్‌లు, వీటికి కలిసిన శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్.. అన్నీ కలిపి 140 కిలోమీటర్ల గోదావరి 365 రోజులూ సజీవంగా ఉంటుంది. కరీంనగర్ జిల్లాకు ఇది అద్భుత జీవధార. అద్భుతంగా భూగర్భ జలాలు పెరుగుతున్నయని గ్రామాల్లో రైతాంగం చెప్పారు. గోదావరి నది మొత్తం కలిపితే 250 కిలోమీటర్లు అవుతుంది. పాత కరీంనగర్ వరకే ప్రత్యేకంగా 140 కిలోమీటర్ల సజీవ, శాశ్వత జలధార ఉంటది. కరీంనగర్ జిల్లాలో కాకతీయకాల్వ మెట్‌పల్లి సమీపంలోని దమ్మన్నపేట వద్ద మొదలై.. వరంగల్ జిల్లా హసన్‌పర్తి చేరుకునే దాక 200 కిలో మీటర్లు పారుతుంది. ఈ 200 కిలోమీటర్ల పొడవునా రెండుపంటలు పండుతాయి. సుమారు తొమ్మిది నెలలు ఈ కాల్వ పారుతూనే ఉంటది. ఇది ఒక సజీవ జలధార. 160 కిలోమీటర్ల నిడివి వరదకాల్వ 365 రోజులూ నిండే ఉంటది. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం కింద వరదకాల్వ ఎప్పుడూ నింపే ఉంటుంది కాబట్టి దాన్ని అద్భుతంగా వినియోగిస్తామని కెసిఆర్ వివరించారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు శ్రీరాంసాగర్ పునరుజ్జీవ పథకం, పాలమూరు- రంగారెడ్డి, డిండి, సీతారామ ప్రాజెక్టు నిర్మాణాల పురోగతిపై ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించింది. దీనిలో భాగంగానే సీఎం స్వయంగా నిర్మాణాలను పరిశీలించాలని భావిస్తున్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలుత ఆయన ప్రాజెక్టులపైనే సమీక్ష నిర్వహించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ తొలి ప్రాధాన్యం ప్రాజెక్టులే అనే సంకేతాలిచ్చారు. ఈ ఏడాదే కాళేశ్వరం ప్రాజెక్టు కింద సాగునీటిని ఇవ్వాలని నిర్ణయించిన దృష్ట్యా పనుల్లో మరింత వేగం పెంచాలనేది కెసిఆర్ లక్ష్యంగా ఉంది. కొన్ని చోట్ల నిర్మాణాల పురోగతిలో జాప్యం చోటుచేసుకుంటోందని, తానే స్వయంగా పరిశీలిస్తానంటూ గత సమీక్షలో పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే సీఎం క్షేత్రస్థాయి పర్యటనకు ప్రాధాన్యం ఇచ్చారు. అంతేగాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి కొండపోచమ్మ సాగర్ వరకు నిర్మిస్తున్న పనులను సీఎం ఎప్పటికపుడ ఆరా తీస్తున్నారు. మొత్తంగా తాను అనుకున్నట్లుగా ప్రాజెక్టులు పూర్తి చేసి గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో ఉన్నారు. గోదావరి ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ దశ మారనుంది. ఇప్పటికే వ్యవసాయ భూములకు ధరలు పెరగడంతో పాటు, సాగునీరు రావడంతో రైతులకు లాభాలు పండనున్నాయి.ఇక అవసరమైన పంటలే పండించి ముందుకు సాగడం రైతు వంతు కావాలి. ప్రభుత్వం చేస్తున్న భగీరథ యత్నంతో రైతన్న ప్రజలకు కడుపునిండా భోజనం పెట్టగలిగితే అంతకుమించిన ఆనందం ఉండదు. ఆహారధాన్యాల కొరత లేకుండా చేయడంలో కృషి సాగాలి.

పంజావిసురుతున్న చలిపులి

హైదరాబాద్‌లో చలకితోడు చిరుజల్లులు
దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
హిమాలయాల మీదుగా శీతల గాలులు
అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

హైదరాబాద్,డిసెంబర31(ఆర్ఎన్ఎ): చల్లగాలులు తెలుగు ప్రజలను వణికిస్తున్నాయి.

చలి తీవ్రత రాత్రివేళల్లో మరింత ఎక్కువగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోవడమే గాకుండా చలిగాలులు విపరీతంగా పెరిగాయి. హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి మబ్బులు కమ్మి ఉండటంతో పలు ప్రాంతాల్లో సూర్యుడి దర్శనం కనిపించలేదు. దీంతో చలి తీవ్రత పెరిగింది. దీనికి తోడు చిరుజల్లులు పలుకరించాయి. జూబ్లిహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్ నగర్, ఖైరతాబాద్‌లో చిరుజల్లులు కురిశాయి. అటు అంబర్‌పేట్, నాగోల్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, తదితర ప్రాంతాల్లోనూ చిరుజల్లులు పడ్డాయి. చలికితోడు చిరుజల్లులు పలుకరించడంతో నగరవాసులు మరింతగా చలికి వణికిపోయారు.దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. శీతల గాలుల నుంచి ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలని, వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. విశాఖ ఏజెన్సీని చలి వణికిస్తోంది. లంబసింగిలో అత్యల్పంగా జీరో డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చింతపల్లిలో కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. తెలంగాణలో చలిగాలుల తీవ్రత అధికంగా ఉంది. ఏజెన్సీ ప్రాంతాల్లో మూడు డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయింది. గడచిన 10ఏళ్లలో 2010 డిసెంబర్‌లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆ తర్వాత ప్రస్తుతం కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వృద్ధులు, పసి పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగమంచు కారణంగా సూర్యుడు ఉదయం 11 గంటల తర్వాతే దర్శనమిస్తుండటం గమనార్హం. ఈ చలి తీవ్రతకు స్వెట్టర్లు, గ్లౌజులు, మాస్క్‌లు, హీటర్లకు డిమాండ్ బాగా పెరిగింది. మరోవైపు శీతల గాలుల ఉధృతి పెరగడంతో రాష్ట్ర ప్రజలు చలితో ఇబ్బందుల పాలవుతున్నారు. ఉత్తర, ఈశాన్య భారత రాష్ట్రాల నుంచి రెండువైపులా శీతల గాలులు తెలంగాణవైపు వీస్తున్నాయి. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా 6 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు సైతం సాధారణంకన్నా తక్కువగా ఉంటున్నందున వేడి తగ్గింది. గాలిలో తేమ బాగా తగ్గడంతో పొడి వాతావరణం ఏర్పడుతోంది. రాత్రి చలి, పగలు పొడి వాతావరణం వల్ల ప్రజలు శ్వాసకోశ సమస్యలతో అవస్థలు పడుతున్నారు. మరో రెండురోజులు సైతం చలి ఇదే విధంగా కొనసాగే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు తెలిపారు. ఉత్తరాది నుంచి వచ్చే శీతల గాలులు తొలుత ఉత్తర తెలంగాణలో ప్రవేశిస్తాయని అందువల్లనే ఆదిలాబాద్, మెదక్‌లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా పడిపోవడం సాధారణం అని చెప్పారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చలి వాతావరణం అధికంగా ఉంది. హిమాలయాల నుంచి దేశమంతటికీ శీతల పవనాలు అధికంగా వీస్తున్నాయి.

గజగజ వణుకుతన్న ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలి భయానికి ప్రజలు గడపదాటాలంటే భయపడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. శీతల గాలులు వీచడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రజలు గజగజ వణుకుతున్నారు. రాబోయే రోజుల్లో ఈదురు గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు. బయట వెళ్లాల్సి ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచు ఆవరించడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండటంతో లైట్లు వేసుకొని ముందుకు కదలాల్సిన పరిస్థితి నెలకొంది. కుమురం భీం, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోనూ చలి తీవ్రత బాగా పెరిగింది. కశ్మీర్‌ను తలపిస్తున్న ఈ వాతావరణంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కొత్త ఏడాది ఆనందోత్సాహాలతో సాగాలి

మహబూబ్‌నగర్,డిసెంబర్31 (ఆర్ఎన్ఎ): జిల్లా ప్రజలు కొత్త సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రొనాల్డ్ రోస్ సూచించారు. ముఖ్యంగా యువత జాగ్రత్తలు పాటించాలని అన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతుగా సహకారం అందించాలన్నారు. శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ అన్నారు. ప్రభుత్వ పథకాలను అందరూ అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. హరితహారంలో వచ్చేయేడు గణనీయమైన ప్రగతికి ప్రజలు తోడ్పాటు అందించాలని కలెక్టర్ కోరారు. బాల్య వివాహాలను నియంత్రించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ రొనాల్డ్ రోస్ అన్నారు. జిల్లాలో ఇప్పటికీ ఇళ్ల వద్ద ప్రసవాలు జరుతున్నాయని, ఇది ఎంతమాత్రం మంచిది కాదని అన్నారు. ప్రతి కాన్పు ఆసుపత్రిలో జరిగేలా చూడాలని సూచించారు. కేజీబీవీల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపట్టాలని, బాలికలకు వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కావాల్సిన నిత్యావసర సరకులు అందుబాటులో ఉంచాలని, నెలలో 20 అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్ వైజర్స్ తనిఖీ చేయాలని ఆదేశించారు. అభివృద్ధిలో తాము ఓ చేయి వేసి ముందుకు సాగుదామని అన్నారు. కొత్త ఏడాది ప్రజలతో కలిసి పని చేస్తామని, సమస్యలు ఉంటే నేరుగా తమతో విన్నవించు కోవాలని ఎస్పీ రెమారాజేశ్వరి అన్నారు. ఇప్పటికే ప్రజల భాగస్వామ్యం పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. మండలంలోని పరిశ్రమలలో పని చేసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కొత్త వ్యక్తులు వస్తారని , కొత్త వ్యక్తుల కదిలికలను ఎప్పటికప్పుడు గమనిచాలని సూచించారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అధికారుల మాట, పనితీరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వివరించారు. చిన్న జిల్లాలు కావడంతో పర్యవేక్షణ పెంచేందుకు అకాశం లభించిందన్నారు. పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నేరాల నియంత్రణ కోసం ఇవి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఎఫ్ఐఆర్‌లు కూడా ఆన్‌లైన్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 99 శాతం పూర్తి అయిందని చెప్పారు. కేసుల విచారణ వేగంగా జరగడంతో పాటు నేరస్థులకు శిక్షపడే విధంగా పర్యవేక్షణ చేసేందుకు ఎస్పీ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. జిల్లాలో రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై కార్యక్రమాలు కొనసాగిస్తామని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, బాలల రక్షణపై ప్రత్యేక నిఘాతో పాటు అవగాహన కార్యక్రమలు నిర్వహించి, వారికి ఇబ్బంది కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు

-కలెక్టర్, ఎస్పీల ఆకాంక్ష

హెల్మెట్ లేకుండా ప్రయాణం

ప్రియాంకకు జరిమానా విధింపు

లక్నో,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): ఎఐసిసి కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఉత్తరప్రదేశ్ లక్నో పోలీసులు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించకుండా, ప్రమాదకరంగా ద్విచక్రవాహనంపై వెళ్లారంటూ.. ప్రియాంకతో పాటు మరో కాంగ్రెస్ నేత ధీరజ్ గుర్జార్ కు రూ.6,100 జరిమానా వేశారు.

దీనికి సంబంధించిన చలానాలను వాహన యజమాని రాజ్ దీప్ సింగ్ కు పంపారు. పౌర వ్యతిరేక నిరసనల్లో అరెస్టయిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి దారాపురి కుటుంబాన్ని పరామర్శించేందుకు గత శనివారం ప్రియాంక లక్నో వెళ్లారు. ఈ సందర్భంగా ప్రియాంక ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

తమను ఎందుకు అడ్డుకున్నారని పోలీసులతో ప్రియాంక వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసుల కళ్లుగప్పి ప్రియాంక, ధీరజ్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. హెల్మెట్ లేకుండానే వారు ప్రయాణిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిందంటూ... వీటి ఆధారంగా ట్రాఫిక్ ఎస్పీ

పల్లెల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట

రెండోదశ ప్రణాళికకు రంగం సిద్ధం
గ్రామాలను చుట్టి రానున్న అధికారులు

నిర్మల్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): పల్లెలు ప్రగతి బాటలో పయనించేలా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తొలిదశ విజయవంతంకావడంతో ఇప్పుడు ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా మరోమారు సిద్ధం చేస్తున్నారు. మొదటిదశలో సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా హాజరయ్యారు. అన్ని గ్రామాల్లోప్రత్యేక ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించి, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న సంకల్పాన్ని చాటారు. దీంతో జిల్లాకు చెందిన రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కలెక్టర్ ఎం.ప్రశాంతి రెండో దశకు ఇప్పుడు సిద్ధం అయ్యారు. 2నుంచి జరుగనున్న ఈ కార్యక్రమం కోసం షెడ్యూల్ ఖరారు చేశారు. ఈమేరకు జిల్లాలోని వివిధ మండలాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలను సన్నద్ధం చేయనున్నారు. ఆయా గ్రామాల్లోని వీధుల్లో పర్యటించి.. సమస్యలు అడిగి తెలుసుకుంటారు. గ్రామాలను పరిశుభ్రంగా మార్చుకోవడం, పచ్చదనం పెంచే కార్యక్రమాలు చేపట్టడం, ప్రజల భాగస్వామ్యాన్ని విస్తృతంగా పెంపొందించడం, నియంత్రిత పద్ధతిలో నిధుల వినియోగం, ప్రజాప్రతినిధులు, అధికారుల్లో జవాబు దారీతనం పెంచడం, వార్షిక, పంచవర్ష ప్రణాళికలు తయారు చేయడం వంటి లక్ష్యాలతో చేపట్టిన ఈ కార్యక్రమంతో ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 19మండలాలు ఉండగా.. ఇందులో 18గ్రామీణ మండలాలున్నాయి. వీటి పరిధిలో 396 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామ పంచాయతీల్లో 30 రోజుల ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక విస్తృతంగా కొనసాగింది. ఈ కార్యక్రమం అమలు కోసం ఇప్పటికే గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను, మండలాలకు జిల్లా స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరితో పాటు ఎంపీడీవోలు, ఎంపీవోలు ఆయా గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షిస్తారు. కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారా.. లేదా.. అని పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అమలు చేస్తుండగా.. పల్లెలను ఆదర్శంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగనున్నారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారు. పంచాయతీలు, అధికారులు చేపట్టిన విస్తృత ప్రచారం ప్రజల్లో చైతన్యం రగిలిస్తోంది. దీంతో గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి.. భాగస్వాములవుతున్నారు. దీంతో పాటు గ్రామాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని కొందరు ముందుకు వస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ వీధుల్లో నెలకొన్న సమస్యలను గుర్తిస్తుండగా.. ముఖ్యంగా నాలుగు ప్రధానాంశాలపై దృష్టి సారించారు. పారిశుధ్యంలో భాగంగా కూలిన ఇండ్లు, పాడు బడిన పశువుల కొట్టాలు, వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు, పాడుబడిన బావుల పూడ్చివేత, నిరుపయోగంగా ఉన్న బోర్ల తొలగింపు, మురుగు కాల్వలను శుభ్రం చేయడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశు ధ్యం నెలకొల్పేందుకు, సంతలు, మార్కెట్ల ప్రదేశాలను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికీ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం, తడి, పొడి చెత్త బుట్టల ఏర్పాటు, చెత్తను డంపింగ్ యార్డుల్లోనే వేసేలా స్థానికులకు ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పంచాయతీల్లో మొక్కలను నాటే ప్రదేశాలను గుర్తించడం, నర్సరీలను ఏర్పాటు చేయడం కోసం స్థలాల ఎంపిక, శ్మశాన వాటికల నిర్మాణం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తించి.. పరిష్కరించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. గ్రామసభలు నిర్వహించి.. వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించేందుకు నిర్ణయించారు.

నల్లమలలో ప్రకృతి పరిరక్షణకు కట్టుబడిఉన్నాం

- అక్కడ యురేనియం ఉందోలేదో తెలుసుకోవడానికే అనుమతిచ్చాం
- అడవుల విస్తీర్ణంలో ఏపీ ముందంజలో ఉంది
- 990 చదరపు కి.మీ అడవుల విస్తీర్ణం పెరిగింది
- కేంద్రం మంత్రి ప్రకాష్ జవదేకర్

న్యూఢిల్లీ, డిసెంబర్31(ఆర్ఎన్ఎ) : నల్లమలలో యురేనియం తవ్వకాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని, కేవలం నల్లమలలో యురేనియం ఉన్నదో లేదో తెలుసుకోవడానికే అనుమతి ఇచ్చామని కేంద్ర అటవీ పర్యవరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ అన్నారు. సోమవారం ఇండియన్ ఫారెస్టు సర్వే రిపోర్ట్‌ను ఆయన న్యూఢిల్లీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడువల అభివృద్ధిలో ఏపీ ముందజలో ఉందని తెలిపారు. ఏపీలో అత్యధికంగా 990 చదరపు కిలోమీటర్ల అడవుల విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. వృక్షాలను పెంచడం భారత జాతి సంస్కృతి అని, ప్రపంచంలో అడవులు అత్యధికంగా పెరిగిన దేశాల్లో ఇండియాలో ముందంజలో ఉందని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో దేశంలో 13వేల చదరపు కిలోమీటర్ల అడవి పెరిగిందని, పారిస్ లక్ష్యాలకు అనుగుణంగా విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. కంపా పథకం కింద అడవుల పెంపకానికి రూ. 40వేల కోట్లు రాష్ట్రాలకు ఇచ్చామని వెల్లడించారు. సర్వే నివేదికలో దేశ వ్యాప్తంగా గణనీయంగా అడవుల విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. అత్యధికంగా ఏపీ 990 చ.కి.మీ అడవులు విస్తీర్ణం పెరిగి పర్వతాల్లోని అడవుల శాతంలో 0.19 శాతం పెరిగిందని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో అడవుల శాతం తగ్గిందని, ఒక చెట్టు కట్ చేస్తే పది చెట్లు పెంచేలా ప్రణాళిక ఉండాలని అన్నారు. వెదురు బొంగులను గడ్డి జాతిలో వేయడం వల్ల వెదురు ఉత్పత్తులు పెరిగాయన్నారు. నల్లమలలో యురేనియం ఉందా లేదా అని తెలుసుకోవడానికి మాత్రమే అనుమతిని ఇచ్చామని, నల్లమల లో ప్రకృతి పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. ఎర్ర చందనం భారత జాతి వృక్షం అయినా.. దానిని మన ం పెంచకపోవడం వల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధించ డానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజస్థాన్‌లో జల స్వావలంబన వల్ల అడవుల విస్తీర్ణం పెరిగిందని మంత్రి పేర్కొన్నారు

పాక్‌లో హిందువులంతా ఏమయ్యారు?

వారి గురించి ఏనాడైనా ఆలోచించారా
ఇందిరాపార్క్ సమావేశంలో కిషన్ రెడ్డి ప్రశ్న

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): దేశాన్ని మతప్రాదిపకన విభజించకుండా ఉంటే ఇవాళ పౌరసత్వ చట్టం అవసరం వచ్చేది కాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పాకిస్థాన్ ఏర్పాటుతో ముస్లిం రాజ్యంగా అవతరించిన అక్కడ హిందువులు అంతా ఏమయ్యారని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా పౌరసత్వ చట్టం పై నిరసనలు జరుగుతున్నాయి, అయితే సిఏఏ ఏ ఒక్కరికీ వ్యతిరేకం కాదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు

. సిఏఏ, ఎన్ఆర్‌సిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇందిరాపార్కు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని నిరసనలు చేసినా, ఎంత రెచ్చగొట్టినా సిఏఏను దేశంలో అమలు చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. విదేశీ శక్తులు, స్వదేశీ శక్తులు కలిసి మోడి ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నాయని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో పోలీసులపై జరిగిన దాడులను గుర్తు చేస్తూ.. పోలీసులకు రాజకీయాలతో సంబంధం లేదని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయరాదని హెచ్చరించారు. అంతేకాకుండా పాక్, బంగ్లాదేశ్‌లో ఉన్న మైనారిటీ రక్షణకు కృషి చేస్తున్నామన్నారు. ఆ దేశాలను ఇస్లామిక్ దేశాలుగా మార్చారని తెలిపారు. పాకిస్థాన్‌లో మైనారిటీలు 3 శాతానికి పడిపోయారు. మైనారిటీలంతా ఏమయ్యారు? చాలా మందిని హత్య చేశారు. అందుకోసమే బిజెపి ప్రభుత్వం 2015లోనే ఈ చట్టాన్ని తీసుకురావడానికి యత్నించిదన్నారు. కాకాపోతే రాజ్యసభలో మెజార్టీ లేనందున అప్పుడు ఆమోదం పొందలేకపోయిందని కిషన్ రెడ్డి అన్నారు.

ఆర్థిక రంగంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు. ఉమ్మడి పౌరసత్వ సవరణ చట్టం ఏ ఒక్క భారతీయుడికీ వ్యతిరేకం కాదని అన్నారు. రాహుల్ గాంధీ తీరు చదివిస్తే ఉన్న మతి పోయిందన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు సీఏఏపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. టీఆర్ఎస్, మజ్లిస్, కాంగ్రెస్ మూడు పార్టీలు ఒక్కటేనని.. టీఆర్ఎస్, కాంగ్రెస్‌లను నడిపించేది ఎంఐఎం పార్టీనేనని మండిపడ్డారు. హోంశాఖ మంత్రిగా ఉన్న మహమూద్ అలీని కేసీఆర్, అసదుద్దీన్ ఇద్దరూ అవమానించారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం తగదని కిషన్ రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్‌తోపాటు మరికొన్ని పార్టీలు కలిసి హింసకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. బీహార్లో నిరసనల సందర్భంగా 280 మంది పోలీసులకు గాయాలయ్యాయని. హింసలో పాల్గొన్న ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హింసాత్మక దాడిలో పాల్గొన్న వారి నుంచే నష్ట పరిహారం వసూలు చేస్తామని అన్నారు. ఏ ఒక్క భారతీయుడికి ఈ చట్టం వ్యతిరేకం కాదని తెలిపారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ.. ప్రజలను విభజించే ప్రయత్నం చేస్తోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. స్వదేశీ శక్తులు, విదేశీ శక్తులు కలిసి మోదీ ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో కొంతమంది విధ్వంసకారులు పోలీసులపై దాడులకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేస్తూ..పోలీసులకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు.

బైక్‌పై వెంబడించి మహిళ మెడలో చైన్ లాగిన దుండగులు

బాధితుల కేకలతో అప్రమత్తమైన స్థానిక యువకులు
పారిపోతుండగా పట్టుకుని పోలీసులకు అప్పగింత
నిందితుల నుంచి బైక్, కత్తి స్వాధీనం

నల్లగొండ,డిసెంబర్30(ఆర్ఎన్ఎ): పట్టపగలే ఇద్దరు యువకులు దారి దోపిడీకి యత్నించారు. బైక్‌ను వెంబడించి మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించేందుకు ప్రయత్నించారు. బాధితుల కేకలతో అప్రమత్తమైన స్థానిక యువకులు పారిపోతుండగా వారిని పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సంస్థాన్‌నారాయణపురం మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన బాలగోని మల్లేష్, అనిత దంపతులు ఉదయం పని నిమిత్తం చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం వెళ్లారు. అక్కడ పని ముగగిసిన అనంతరం తిరిగి బైక్‌పై కొత్తగూడెం గ్రామానికి వస్తున్నారు. వీరిని ఇద్దరు యువకులు చిమిర్యాల గ్రామం నుంచి బైక్‌పై వెంబడించారు. మల్లేష్, అనిత దంపతులు సంస్థాన్ నారాయణపురం శివారు దాటి కొత్తగూడెం గ్రామ పరిధిలోని మూలమలుపు వద్దకు వచ్చారు. ఈ క్రమంలో వారినే వెంబడిస్తున్న యువకుల్లో ఒకరు అనిత మెడలో ఉన్న పుస్తలతాడును లాగాడు. అది తెగి అనిత దుస్తుల్లో పడింది. వెంటనే మల్లేష్, అనిత కేకలు వేస్తూ దుండగుల బైక్‌ను వెంబడించారు. వీరి కేకలు విన్న కొత్తగూడెం గ్రామానికి చెందిన యువకులు మారగోని శేఖర్, కొడూరి శ్రీశైలంలు దుండగులు బైక్‌ను వెంబడించారు. పుట్టపాక గ్రామా చౌరస్తాలో మరో వాహనం ఎదురుగా రావడంతో దుండగులు అదుపుతప్పి కిందపడిపోయారు. వెంటనే, శేఖర్, మల్లేష్‌లు వారిని పట్టుకున్నారు. దుండగుల బైక్ నుంచి కత్తి పడటంతో అక్కడే ఉన్న కొంత మంది గ్రామాస్తులు వారిని చితకబాదారు. అనంతరం సమాచారమిచ్చి పోలీసులకు అప్పగించారు. బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఇద్దరు యువకులు చౌటుప్పల్ మండలం ఎన్.లింగోటం గ్రామానికి చెందిన శంకర్, పలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన వెంకటనర్సింహగా అనుమానిస్తున్నారు. చిమిర్యాలలో చైన్ స్నాచింగ్‌కు వీరే పాల్పడ్డారని అనుమానిస్తున్నారు. బైక్ కూడా చోరీ చేసి ఉంటారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ..

ఆదిలాబాద్: బోత్ శాసనసభ్యులు రాథోడ్ బాపూరావు ఇవాళ సీఎం సహాయనిధి నుంచి విడుదలైన చెక్కులను అర్హులకు అందజేశారు. ముఖ్ర కె గ్రామానికి చెందిన కదం నాగొరావుకు 60,000 రూపాయలు చెక్కును, సాత్ నెంబర్‌కు చెందిన అడవి వినోద్‌కు రూ. 38,000 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ముఖ్ర ఎంపీటీసీ గాడ్గె సుభాష్ తదితరులు పాల్గొన్నారు

చురుకుగా కాళోజీ వర్సిటీ నిర్మాణ పనులు

-త్వరగా పూర్తయ్యేలా చర్యలు

వరంగల్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ):స్వరాష్ట్రంలో వరంగల్‌కు నూతనంగా మంజూరైన కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి సొంత భవనం లేకపోవడంతో కేఎంసీ ఆవరణలో తాత్కాలికంగా భవనం ఏర్పాటు చేశారు. 2016 జూన్ నుంచి ఈ భవనంలోనే యూనివర్సిటీ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కాళోజీ యూనివర్సిటీకి సొంత భవనం కోసం 2017 ఆగస్టులో గజ్వేల్‌లో జరిగిన సమావేశంలో ప్రధాని మోదీ అక్కడే శంకుస్థాపన చేశారు. దీంతో కాళోజీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం కోసం రూ.24 కోట్ల వరకు యూనివర్సిటీ నిధులను కేటాయించారు. వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పరిపాలన భవనం పనులు చురుకుగా సాగుతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేయించేలా చూస్తున్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు చకచకా పనులు సాగిస్తున్నారు. సెంట్రల్ జైలు ఆవరణలో ఐదెకరాల స్థలం కేటాయించగా గతేడాది విజయదశమి రోజు భూమిపూజతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నూతన భవన నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. ఇందులో వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్ రెక్టార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఇతర విభాగాల కోసం వేర్వేరుగా బ్లాకులను ఏర్పాటు చేశారు. రానున్న మూడు నెలల కాలంలో నూతన భవనం ప్రారంభోత్సవం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. రానున్న మూడు నెలల కాలంలో కాళోజీ అడ్మినిస్ట్రేటివ్ భవనం అధికారులు, ఉద్యోగులకు అందుబాటులో వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం కాళోజీ యూనివర్సిటీ పనులు కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. 6వ తేదీ వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ఆలయ శుద్ధి కార్యక్రమం ఆనవాయితీగా నిర్వహించారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశికి ముందు వచ్చే మంగళవారంనాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వేకువ జామున సుప్రభాత సేవ అనంతరం మూలవిరాట్టును పట్టు పరదలతో పూర్తిగా కప్పేసి..ఆనంద నిలయం, బంగారు వాకిలి, ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పూజ పాత్రలను అర్చకులు, ఆలయ సిబ్బంది శుభ్రపరిచారు. శుద్ధి తర్వాత నమపు కొమ్ము, శ్రీ చూర్ణం, పచ్చ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలి గడ్డలతో శాస్త్రోక్తంగా తయారు చేసిన సుగంధం వెధచల్లే పరిమళం అనే ద్రవ్యాన్ని గోడలకు పై పుతగా పూసి అనంతరం శ్రీవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. టీటీడీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా అష్టదల పాదపద్మారాధన సేవ రద్దు చేసింది. ఆలయ అర్చకులు సుప్రభాతం, తోమాల,అర్చన సేవలను ఏకాంతంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులను స్వామి వారి సర్వదర్శనానికి అనుమతించారు. ఇవో అశోక్ సింఘాల్,ఛైర్మన్ సుబ్బారెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు.

కల్తీకల్లుకు వ్యక్తి మృతి

మేడ్చల్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): కుత్బుల్లాపూర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి సికిందర్ అనే వ్యక్తి కల్లు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆ తర్వాత స్నేహితులు సికిందర్‌ను ఇంట్లో వదిలివెళ్లిన కొద్దిసేపటికే అతను ప్రాణాలు కోల్పోయాడు. కల్లులో ఏదో కలిపి తన భర్తను చంపారని భార్య ఆరోపిస్తుంది. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడి నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముంబైలో తలలేని మహిళ శవం స్వాధీనం

-దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ముంబయి,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): తల, కాళ్లు లేని మహిళ మొండెం లభించిన సంఘటన మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని విద్య విహార్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం? నవల్ గేట్ సమీపంలో తలలేని మొండెం గల మృతదేహం కనిపించడంతో పాదచారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బెడ్ షీట్‌లో కాళ్లు, తల లేని మొండెం గల నైటీతో ఉన్న మహిళ (30) మృతదేహంగా గుర్తించారు.

స్థానిక మహిళ మృతదేహం కాకపోవచ్చని వేరే ప్రదేశాలలో హత్య చేసి విద్య విహార్ ప్రాంతంలో మృతదేహాన్ని పడేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. విద్య విహార్ లో ఉన్న సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని డిసిపి అఖిలేష్ సింగ్ తెలిపాడు.

ఒక్క డిసెంబర్ లోనే మొండెం లేని మూడు మృతదేహాలు ముంబయి నగరంలో కనిపించడం కలకలం సృష్టిస్తోంది. డిసెంబర్ 2న తలలేని మొండెం ఉన్న ఓ వ్యక్తి మృతదేహం కనిపించిన సంఘటన అరేబియన్ సముద్ర తీరంలో మహిమ్ దర్గాహ ప్రదేశంలో చోటుచేసుకుంది. దర్యాప్తులో భాగంగా మొండెం బెనట్ట్ రెబెల్లోదిగా గుర్తించారు. ఓ యువతిని రెబెల్లో లైంగికంగా వేధిస్తుండడంతో ఆమె తన లవర్ సహాయంతో అతడిని హత్య చేసి మొండెమును అరేబియన్ సముద్రంలో పడేశారు. రెండో ఘటన తల లేని మొండెమును బస్తాలో పెట్టి చాంబుర్ ప్రాంతంలో పడేశారు. ఆ మొండెం దేవేంద్ర అఖేడ్‌గా గుర్తించారు. దేవేంద్ర ప్రతి రోజు మద్యం సేవించి భార్యను వేధిస్తుండడంతో తన తమ్ముడితో కలిసి భర్తను హత్య చేసినట్టు పోలీస్ దర్యాప్తులో తేలింది.

లంచం తీసుకున్న కేసులో ఐఎఎస్ అధికారి సస్పెన్షన్

భువనేశ్వర్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): లక్ష రూపాయలు లంచం తీసుకున్న ఆరోపణలతో ఓ ఐఎఎస్ అధికారి సస్పెండ్ కావడంతో పాటు అరెస్ట్ అయిన సంఘటన ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగింది.

ఐఎఎస్ అధికారి బినయ్ కేతన్ ఉపాధ్యాయ్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. హార్టికల్చర్ విభాగంలో కొన్ని ఫైళ్లపై సంతకం చేయడానికి లక్ష రూపాయలు లంచం తీసుకున్నారని ఆరోపణలు రావడంతో ఒడిశా విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ ఐఎఎస్ అధికారి బినయ్‌ను అరెస్టు చేసింది.

అవినీతికి పాల్పడిన అధికారులు పట్టుకోవడానికి ఒడిశా ప్రభుత్వం 'మో సర్కార్' అనే సంస్థను తీసుకొచ్చింది.

పంచాయితీల్లో డంపింగ్ యార్డులు తప్పనిసరి

ఆదిలాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డుల్లోకి చెత్తను తరలించేలా చూడాలని అసిస్టెంట్ కలెక్టర్ అభిలాష్ అభినవ్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కార్యక్రమాల అమలును సమీక్షించారు.

ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు ఉండేలా చూడాలని, ఉన్న వాటిలోనే చెత్తను వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైకుంఠధామాలు ఏర్పాట్లు పూర్తి చేయాలని చెప్పారు. గ్రామాల్లో స్థలం లేనిచోట ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేస్తామన్నారు.

ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

గ్రామీణ ప్రాంతాల్లో పెంటలను గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు చెప్పాలన్నారు. లేదంటే కంపోస్టు ఫీట్స్ నిర్మించి ఇవ్వాలని, దీంతో రైతుకు సేంద్రియ ఎరువు తయారు చేసుకునే వీలు కలుగుతుందన్నారు. ఇవన్నీ రానున్న ప్రణాళికలో పూర్తయ్యేలా చూసుకోవాలని చెప్పారు.

తెరాస పెద్దలు,
పోలీసులు కుమ్మక్కయ్యారు

- దురాలోచనతోనే ర్యాలీకి అనుమతివ్వలేదు
- కాంగ్రెస్ నేతలు శ్రవణ్, అంజన్ కుమార్ యాదవ్

హైదరాబాద్, డిసెంబర్31(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో తెరాస పెద్దలు, పోలీసులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రతిష్ట ఎక్కడ పెరుగుతోందోననే దురాలోచనతో ర్యాలీకి అనుమతివ్వలేదని ధ్వజమెత్తారు. సీపీని ఒక మాట అనగానే మంత్రి తలసాని కలుగులోంచి బైటకు వచ్చారని ఎద్దేవా చేశారు. తలసాని నోటికి వచ్చినట్లు మాట్లాడవద్దని, నాలుక అదుపులో పెట్టుకోవాలని దాసోజు హెచ్చరించారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి సీపీకి ఫోన్ చేస్తే అమర్యాదగా మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అంజనీకుమార్ తెలంగాణలో ఎందుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐపీఎస్‌లు రాజ్యాంగానికి అనుగుణంగా పనిచేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. నాయకుల లేఖలపై పోలీసుల బదిలీలు జరుగుతున్నాయని ఆరోపించారు. శాంతియుత ర్యాలీకి ఎందుకు అనుమతివ్వలేదని ఆయన నిలదీశారు.

పార్లమెంట్ ఆమోదం పొందిన చట్టాన్ని అమలు చేయాల్సిందే

ఇది రాష్ట్రాల కనీస విధి అన్న మేఘావాల్
దేశవిభజన నాటి సమస్యలు సృష్టిస్తున్నారన్న గిరిరాజ్

న్యూఢిల్లీ,డిసెంబర్31(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ రాష్ట్రాల్లో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్రం ఓ విస్పష్ట ప్రకటనను చేసింది. పార్లమెంటు ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లును అన్ని రాష్ట్రాలు అమలు చేసి తీరాల్సిందేనని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందేనని, ఇందులో మినహాయింపు ఉండదని అన్నారు. పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ కేరళ సీఎంతో పాటు కొన్ని పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేయడంతో మేఘ్‌వాల్ ఈ ప్రకటన చేశారు. ఏ ప్రభుత్వమైనా సీఏఏను అమలు చేయమని అంటే, అది రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని, ఎందుకంటే ఆ బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని అన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, అన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందే నని అర్జున్ రామ్ మేఘ్‌వాల్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌరుల జాబితా (ఎన్ఆర్సీ)లను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రస్థాయిలో స్పందించారు. మళ్లీ దేశంలో స్వాతంత్యానికి పూర్వం నాటి వాతావరణం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలను రెచ్చగొడుతున్నారని ఆయన ఆరోపించారు. మీడియాతో గిరిరాజ్ మాట్లాడుతూ...రాహుల్ గాంధీ, 'తుక్డే తుక్డే' గ్యాంగ్ సహా ప్రతిపక్షాలన్నీ దేశంలో 1947కి ముంద

సరళాసాగర్ జలాశయానికి గండి

- భారీగా నీరు చేరడంతో లీకేజీలతో గండి
- జలాశయం నుంచి కొత్తపల్లి వాగు, రామన్‌పాడు డ్యాంలోకి చేరుతున్న నీరు
- గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే
- త్వరలోనే సరళాసాగర్ పునఃనిర్మాణం చేస్తాం
- రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు
- వెల్లడించిన మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సరళాసాగర్ జలాశయానికి భారీ గండి పడింది. జలాశయం పూర్తి స్థాయిలో నిండటం, లీకేజీలు, ఆటోమేటిక్ సైఫన్ సిస్టం తెరచుకోకపోవడంతో కట్టపై ఒత్తిడి అధికమై ఎడమవైపు ఆనకట్ట తెగిపోయింది. ప్రస్తుతం పూర్తి స్థాయి నీటిమట్టం 22 అడుగులకు చేరింది. సుమారు అర టీఎంసీ నీటి నిల్వ

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సరళాసాగర్ జలాశయానికి భారీ గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి నిరంజన్ రెడ్డి.

కొనసాగుతోంది. ఈ నీరంతా సరళాసాగర్ జలాశయం నుంచి దిగువప్రాంతాలకు చేరుతోంది. కొత్తపల్లి వాగుకు ఇరువైపులా ఉన్న నారుమళ్లు విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయే అవకాశమున్నట్లు తెలుస్తుంది. మదనాపురం వద్ద కొత్తకోట-ఆత్మకూరు రహదారి కాజ్‌వేపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రామన్‌పాడు జలాశయంపైనా ఒత్తిడి పెరగడంతో 19 గేట్లకు గాను 9 గేట్లు తెరచి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. నీటి ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ఒక్కోగేటు ఎత్తేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. ఈ నీరంతా ఊకచెట్టువాగు ద్వారా కృష్ణానదిలోకి చేరుతున్నాయి. 2009 తర్వాత రామన్‌పాడుకు వరద రావడం ఇదే మొదటి సారి. ఊకచెట్టు వాగు సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అజ్జకొల్లు, మేడిపల్లి, రేచింతల, వీరరాఘవపురం గ్రామాల్లో విద్యుత్ మోటార్లు, నారుమళ్లు నీటమునిగే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మదనాపురం మండలం శంకరమ్మ పేట వద్ద సరళాసాగర్ జలాశయానికి గండి పడిన విషయం తెలుసుకున్న వసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి పరిశీలించారు. జలాశయం కట్ట తెగిన ప్రాంతాన్ని మంత్రి నిరంజన్ రెడ్డి, దేవరకద్ర టీఆర్ఎస్ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించి అధికారులతో సమీక్షించారు. సరళాసాగర్‌కు గండి పడిన విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లామని మంత్రి తెలిపారు. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పునర్నిర్మాణం చేపడుతామన్నారు. రైతులకు రెండో పంటకు ప్రత్యామ్నాయం చూపిస్తామని మంత్రి పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని, యాసంగి పంటకు రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని నిరంజన్ రెడ్డి హామీ ఇచ్చారు. 30ఏళ్ల కాలంలో రెండు, మూడుసార్లు మాత్రమే ప్రాజెక్టు నిండిందని మంత్రి తెలిపారు. కట్ట పునరుద్ధరణకు రెండు, మూడు రోజుల్లో పనులు మొదలు పెడుతామని చెప్పారు. గండికి కారణం ఏంటనేది సాంకేతిక బృందం పరిశీలిస్తుంది అని మంత్రి స్పష్టం చేశారు. ఐదేళ్ల తర్వాత సరళాసాగర్ జలాశయానికి భారీగా వరద నీరు చేరింది. భారీగా నీరు చేరడంతో లీకేజీలతో గండి పడినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. సరళాసాగర్ జలాశయం నుంచి కొత్తపల్లి వాగు, రామన్‌పాడు డ్యాంలోకి నీరు చేరుతోంది. దీంతో రామన్‌పాడు జలాశయం 10 గేట్లను అధికారులు ఎత్తివేశారు. ఆసియాలోనే ఆటోమెటిక్ సైఫన్ సిస్టం కలిగిన తొలి ప్రాజెక్టుగా సరళాసాగర్‌కు ప్రత్యేకత ఉంది. సరళాసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 22 అడుగులు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 0.5 టీఎంసీలుగా ఉంది.

బలవర్ధక ఆహారంతోనే రక్తహీనతకు దూరం

జనగామ,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): పోషణ అభియాన్‌పై ప్రజలు అవగాహన కలిగి బలవర్ధక ఆహారం తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మఅన్నారు. పోషణ లోపం..రక్తహీనత..తక్కువ బరువుతో పుట్టే శిశువుల సంఖ్యను తగ్గించేందుకు గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

మహిళలు, బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటే పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు ఎప్పటికప్పుడు రక్తపరీక్షలు చేయించుకోవాలని, పోషకాలున్న ఆహారాలు ఎక్కువగా తీసుకునేలా వైద్యులు అవగాహనలు కల్పించాలని సూచించారు. పుట్టిన శిశువుకు పుట్టిన గంటలోపేలోనే ముర్రుపాలను తాగించాలని తెలిపారు.

గ్రామాలకు ఆర్థికసంఘం నిధులు

-అభివృద్ధికి దోహదపడతాయంటున్న సర్పంచ్‌లు

కరీంనగర్,డిసెంబర్31(నేటినిజం ప్రతినిధి): గ్రామ పంచాయతీలకు ప్రత్యేక ప్రణాళిక అమలవుతున్న నేపథ్యంలో పెద్ద మొత్తంలో నిధులు వస్తున్నాయి. 14వ ఆర్థిక సంఘం నుంచి వచ్చిన 6.10 కోట్ల నిధులకుతోడు రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నుంచి మరో 4.08 కోట్లు ఆయా ట్రెజరీలకు విడుదల చేశారు. ట్రెజరీ అధికారులు పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అనేక గ్రామాల్లో 70 శాతానికి పైగా ఆస్తి పన్నులు వసూలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఈ గ్రాంట్లు గ్రామాల సత్వర అభివృద్ధికి దోహద పడుతాయి. జిల్లాలో 313 పంచాయతీలు ఉన్నాయి. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కింద 6 కోట్ల 10 లక్షల 28 వేలు, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి 4 కోట్ల 8 లక్షల 86 వేల చొప్పున సుమారు 10.19 కోట్లు ఇప్పటికే విడుదల చేశారు. దీంతో ఆయా గ్రామాల సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు పడుతున్న ప్రస్తుత తరుణంలో ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడుతున్న భావిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధి వేగవంతం చేసేందుకు కేంద్రంతో కలిసి రాష్ట్రం ఎప్పటికప్పుడు గ్రాంట్లను విడుదల చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర బ్జడెట్ నుంచి కూడా పంచాయతీలకు నేరుగా ప్రతి నెలా నిధులు విడుదల చేయాలని సంకల్పించింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొని ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంస్థ నిధులను విడుదల చేసింది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా విడుదలైన ఈ నిధులు ప్రస్తుతం ఆయా ట్రెజరీల్లో జమ చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక పేరిట రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ నిధులు పంచాయతీలకు ఆర్థికంగా చేయూత నివ్వనున్నాయి. జనాభా ప్రాతిపదికన విడుదలయ్యే ఈ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక కార్యాచరణకు ఉపయోగపడనున్నాయి.

వసతుల విషయంలో.. నిర్లక్ష్యం ప్రదర్శించొద్దు

- పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మంత్రి సత్యవతి రాథోడ్
- గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి

మహబూబాబాద్,డిసెంబర్31 (ఆర్ఎన్ఎ): గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, వసతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించొద్దని గిరిజన సంక్షేమ, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని గిరిజన ఏకలవ్య ఆశ్రమ పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కురవి ఏకలవ్య పాఠశాలలో ఉదయం విద్యార్థులు ప్రార్థన చేసే సమయానికి మంత్రి సత్యవతి అక్కడికి చేరుకుని.. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల మార్చ్ సెల్యూట్ ను స్వీకరించారు. ఈ సందర్భంగా బాక్సింగ్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థుల దగ్గరకెళ్లి.. వారితో కలిసి బాక్సింగ్ చేశారు. బాక్సింగ్ ఎలా చేస్తారో విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, గురుకులంలోని మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణను పచ్చదనంతో ఉంచాలని సూచించారు. సరైన రీతిలో పరిశుభ్రత లేదని గుర్తించిన మంత్రి సత్యవతి రీజినల్ కో ఆర్డినేటర్ కు ఫోన్ చేసి మందలించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే విషయంలోనూ, వారికి అందించే వసతుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేంది లేదని మంత్రి సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలు పాటించకపోతే మాట వినని అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కురవి ఏకలవ్య పాఠశాల యాజమాన్యం సంవత్సరపు చివరి రోజు సందర్భంగా విద్యార్థులకు పిక్నిక్ ఏర్పాటు చేయడంతో వారికి మంత్రి సత్యవతి రాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో మంత్రితోపాటు మహబూబాబాద్ జడ్పీ చైర్ పర్సన్ కుమారి అంగోతు బింధు, జడ్పీటీసీ బండి వెంకట్ రెడ్డి, స్థానిక నేతలు, ఇతర అధికారులు ఉన్నారు.

6.మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని గిరిజన ఏకలవ్య ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి సత్యవతి విద్యార్థులతో ముచ్చటించిన దృశ్యం

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం

మున్సిపల్ పరిధిలో దోమల నివారణ
మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు: కలెక్టర్

జనగామ,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): మున్సిపల్ పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా పట్టణంలోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో ఎక్కడ నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. కొత్త సంవత్సరంలో జనగామపట్టణంమరింత అందంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ప్రభుత్వం పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలు కూడా అందుకు బాధ్యతగా సాగాలన్నారు. దోమల నివారణకు మురుగు కాలువలు అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేసేవారికి జరిమానా విధించాలన్నారు. హరితహారంపై రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. కొత్తచట్టంలో కలెక్టర్లకు విస్తృత అధికారులు ఇచ్చారని, ఎలాంటి తప్పులు జరిగినా సంబంధిత అధికారులతోపాటు కలెక్టర్లను కూడా బాధ్యులు చేసే విధంగా చట్టం ఉందన్నారు. కొత్త చట్టంపై ప్రతి అధికారి, సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని, లేకుంటే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని అన్నారు. నాటిన మొక్కల్లో ఒక్కటి ఎండినా.. దానికి సంబంధిత ప్రత్యేకాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తెలంగాణకు హరితహారంలో పట్టణంలో మొక్కలు నాటే టార్గెట్, కొత్త పురచట్టం కఠినతరంగా ఉన్న నిబంధనలు, మొక్కలు ఎండిపోతే శాఖాపరంగా తీసుకునే చర్యలు, ఇప్పటి వరకు నాటిన మొక్కలకు నీటి సరఫరా, సంరక్షణ చర్యలపై అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తమ పరిధిలో ఒక్క మొక్క ఎండిపోయినా బాధ్యుడిపై వార్డు అధికారిపై చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలో ఏడాది చొప్పున ఐదేళ్ల ప్రణాళికతో కొత్త నర్సరీలను ఏర్పాటు చేసుకోవాలని, కొద్దిరోజుల్లోనే అన్ని వార్డుల్లో పచ్చదనం పెంచేందుకు అధికారులు, విభాగాల అధికారులు పకడ్బందీ ప్రణాళికతో వెళ్లాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెరిగి పెద్దయ్యే వరకు బాధ్యుడైన ఇన్‌చార్జి అధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, తనిఖీలు చేసిన సమయంలో సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం కనిపించినా..ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వార్డు ఇన్‌ఛార్జి అధికారిపై వేటు పడుతుందని స్పష్టం చేశారు. వార్డుల వారిగా మొక్కలను నాటడంతోపాటు ప్రతి ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేయాలని, వీటి లెక్కలు పక్కాగా ఇన్‌ఛార్జిల వద్ద ఉండాలని ఆదేశించారు. సంరక్షణ విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ప్రణాళిక మేరకు పనుల గుర్తింపు

రెండో విడతకు సిద్ధంగా భద్రాద్రి జిల్లా
కార్యాచరణ సిద్ధం చేస్తున్న కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): జనవరి 2 నుంచి ప్రారంభం కానున్న ప్రణాళికను సమర్థంగా మరోమారు అమలుచేసేందుకు జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ముమ్మరంగా కొనసాగేలా చేసేందుకు కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ పూర్తిస్థాయి దృష్టి సారించారు. గ్రామ, మండల ప్రత్యేక అధికారులు, పర్యవేక్షణలో గ్రామసభ ద్వారా తయారుచేసుకున్న ప్రణాళికను ప్రతీ గ్రామం ప్రాధాన్యతాంశాల ప్రకారం పనులు చేసేలా సిద్ధం చేశారు. తొలిదశలో కార్యాచరణ ప్రణాళిక ప్రారంభమైన నాటి నుంచి కలెక్టర్ ప్రతీ గ్రామాన్ని చుట్టివచ్చారు. ఉదయం నుంచి గ్రామాలను చుట్టి స్వచ్ఛగ్రామాలుగా చేసి రాష్ట్రంలోనే జిల్లాను కార్యాచరణ ప్రణాళికలో అగ్రస్థానంలో తీసుకెళ్లాలనే తపనతో పనిచేసారు. కొత్త సంవత్సరంలో 2వ తేదీ నుంచి మరో విడత ప్రారంభంకానున్న ప్రణాళిక కోసం మళ్లీ సిద్ధం అవుతున్నారు. గ్రామ, మండల ప్రత్యేక అధికారులు కార్యాచరణ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. ప్రతీ గ్రామంలో పంచాయతీ ప్రత్యేక అధికారితో పాటు మండల ప్రత్యేక అధికారులు పాల్గొని కార్యాచరణను పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో కలియ తిరుగుతూ అటు ప్రజల్లో, ఇటు అధికారుల్లో స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేయనున్నారు. మున్సిపాలిటీల్లో కూడా స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాన్ని చేపట్టాలని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్లు యుద్ధ ప్రాతిపదికన మున్సిపాలిటీల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడం నుంచి మురుగు కాలువలను శుద్ధి చేయడం, నిల్వ నీటిని, పరిసర ప్రాంతాల్లో పిచ్చిమొక్కలను తొలగించడం వంటి పనుల కొనసాగిస్తున్నారు. తొలుత పారిశుధ్య పనులు చేపట్టిన అధికారులు డంపింగ్, గ్రేవ్‌యార్డుల స్థలాల గుర్తింపు, బురదమయమైన అంతర్గత రోడ్ల నవీనీకరణ వంటి పనులతో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు బిజీ కానున్నారు. స్వచ్ఛతెలంగాణెళి లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన సందేశం, స్ఫూర్తితో పల్లెలు ప్రగతిపథంలో ముందుకు దూసుకెళ్తున్నాయి. జిల్లాలో ఆదర్శగ్రామంగా తమ ఊరు ముందుండాలని ప్రతి ఒక్కరూ రెట్టించిన ఉత్సాహంతో గ్రామాల పరిశుభ్రత, పచ్చదనానికి ప్రణాళికతో 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో పాలుపంచుకున్నారు. తొలుత తమ పరిసరాలను శుభ్రం చేసుకొని తద్వారా గ్రామ పరిశుభ్రతకు పాటుపడాలనే కాంక్షతో సాగారు. తెలంగాణకు హరితహారం భాగంగాలో ప్రతీ గ్రామంలో సీఎం కేసీఆర్ ఆదేశాలతో అధికారులు నర్సరీ ఏర్పాటు చేశారు. ఎక్కడా చెత్తాచెదారం లేకుండా, మురుగు కాలువల్లో పేరుకుపోయిన నీటిని తొలగించారు. ఫలితంగా పల్లెలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు అదే స్ఫూర్తితో ముందుకు సాగనున్నారు.

రియల్టర్ ఇంట్లో భారీ చోరీ

హైదరాబాద్,డిసెంబర్31(ఆర్ఎన్ఎ): జవహర్ నగర్ మైత్రీ ఎన్‌క్లేవ్‌లో నివానముంటున్న స్థిరాస్తి వ్యాపారి నర్సింగ్‌రావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. నిన్న రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు.. 50 తులాల బంగారు నగలు, 5 కిలోల వెండితో పాటు నగదును దుండగులు అపహరించారు. బాధిత కుటుంబం నిన్న రాత్రి యాదాద్రి లక్ష్మీనరసింహాస్వామి దర్శనానికి వెళ్లింది. ఈ సమయంలోనే దొంగలు చోరీ చేశారు. నర్సింగరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. చోరీ జరిగిన నివాసాన్ని పోలీసులు పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరా ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు

ఓట్లేసి గెలిపిస్తే..

వారికిచ్చే కానుక ఇదేనా?

- అమరావతి రాజధాని అన్నప్పుడు జగన్ ఎందుకు వ్యతిరేకించలేదు?
- ఇప్పుడెందుకు అమరావతిపై కక్ష చూపుతున్నారు
- అవకతవకలు జరిగితే దోషులను శిక్షించండి..
- కొద్దిమంది నాయకులపై కోపంతో విద్వేషాలు రెచ్చగొట్టొద్దు
- పెయిడ్ ఆర్టిస్ట్ లు, ఎడారి వంటి పదాలు వాడటం క్షమించరాని విషయం
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్
- రైతుల దీక్షలో పాల్గొని మద్దతు తెలిపిన పవన్

అమరావతి, డిసెంబర్31(ఆర్ఎన్ఎ) : వైకాపా న్యాయం చేస్తుందని ఓట్లేసి గెలిపిస్తే.. వారికి ఇచ్చే కానుక ఇదేనా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 14వ రోజు కొనసాగాయి. రైతుల ఆందోళనలకు మద్దతుగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళవారం అమరావతిలో పర్యటించారు. ఎర్రబాలెంలో మహిళా రైతులతోపాటు దీక్షలో కూర్చుని మద్దతు ప్రకటించారు. మహిళలు తమ సమస్యలను పవన్‌కు వివరించారు. ఈసందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రాష్ట్ర విభజన జరిగినప్పుడు.. మళ్లీ విభజన జరక్కూడదు, ప్రాంతీయ విభేదాలు రాకూడదనే ఉద్దేశంతోనే జనసేన పార్టీ స్థాపించానని అన్నారు. రాజధాని నిర్మాణం చాలా కష్టమైన పని అని, 2014 ఎన్నికలకు ముందు గాంధీనగర్‌లో మోదీని కలిసినప్పుడు రాజధాని ప్రస్తావన వచ్చిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేశారని చెప్పానని, బాంబే రాష్ట్రంగా ఉన్నప్పుడు గుజరాత్ విడిపోయిందని, గుజరాతీలు కూడా ఎంతో కష్టపడి గాంధీనగర్‌ను రాజధానిగా ఏర్పాటు చేసుకున్నారని గుర్తుచేశారు. అలాంటి రాజధాని మీకు కావాలి అని మోదీ చెప్పారు. నగర నిర్మాణం కొన్ని దశాబ్దాలపాటు జరిగే పక్రియ అని, అంచెలంచెలుగా రాజధానిని నిర్మించండని, ఆరోజు అందరం అమరావతి అనుకున్నప్పుడు ఎవరూ వ్యతిరేకించలేదని పవన్ అన్నారు. రైతులంతా ముందుకొచ్చి 33వేల ఎకరాలు ఇచ్చారని, ప్రభుత్వాన్ని నమ్మి మీ బిడ్డల భవిష్యత్తు కోసం భూములు ఇచ్చారని పవన్ అన్నారు. అమరావతిని రాజధానిగా ఆమోదిస్తున్నామని అసెంబ్లీలో జగన్ మోహన్‌రెడ్డి చెప్పారని పవన్ గుర్తు చేశారు. కానీ ఈరోజున మహిళలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారంటే.. ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి సిగ్గుపడాలని పవన్ అన్నారు. రాజధాని కంటే ముందు రైతులకు అండగా ఉంటామని, రాష్ట్ర ప్రయోజనాల కోసం మీరు భూములిస్తే ప్రభుత్వం మోసం చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో స్థిరత్వం కోసం ప్రజలు 151 సీట్లు ఇస్తే అస్థిరత ఏర్పరుస్తున్నారని పవన్ అన్నారు. అమరావతిలో వైకాపా నేతలను గెలిపిస్తే వారు కూడా అండగా లేకపోవడం దారుణమని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతిలో రాజధాని ఉండటం ఇష్టం లేదని జగన్ ఒక్కమాట చెప్పి ఉంటే.. రైతులు భూములు ఇచ్చేవారు కాదని అన్నారు. జగన్‌ను రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే.. ఆయన కొన్ని జిల్లాలకే పరిమితమవుదామంటే కుదరదని పవన్ అన్నారు. అమరావతిపై మీకు ఎందుకంత కక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. అమరావతిలో అవకతవకలు జరిగితే దోషులను శిక్షించండి.. సంతోషిస్తాం. చట్టాలు మీచేతిలోనే ఉన్నాయి. కొద్ది మంది నాయకులపై కోపంతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం సమంజసం కాదు. పెయిడ్ ఆర్టిస్టులు, ఎడారి వంటి పదాలు ఉపయోగించడం క్షమించరాని విషయమన్నారు. వైకాపా నేతలు స్పష్టమైన ప్రకటన చేయాలని, అమరావతి రాజధానిగా ఉండదు, విశాఖపట్నమే రాజధాని అని స్పష్టంగా ప్రకటిస్తే.. అప్పుడు జనసేన కార్యాచరణ ప్రకటిస్తుందని అన్నారు. వారు మాట ఇచ్చి.. ధర్మం తప్పారని, ఈరోజున నేను మాటిస్తున్నాను.. మీకు న్యాయం జరిగే వరకూ జనసేన అండగా ఉంటుందని అన్నారు. హైకోర్టును ఇక్కడి నుంచి కదిలించాలంటే సుప్రీంకోర్టు అనుమతి కావాలని, హైకోర్టు కర్నూలులో ఏర్పాటు చేస్తామని రాయలసీమ ప్రజలను మోసం చేస్తున్నారని పవన్ అన్నారు. జీఎన్ రావు కమిటీ సచివాలయం విజయనగరంలో పెట్టాలని సూచించిందని, కానీ భీమిలిలో పెట్టమని కాదని, అన్నం పెట్టే రైతుకు అన్యాయం జరిగితే బాధేస్తుందని అన్నారు.

మందడం సమీపంలో పవన్‌ను అడ్డుకున్న పోలీసులు..

రాజధానిలోని రైతుల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు జనసేన అధినేత మంగళవారం అమరావతిలో పర్యటించారు. ఎర్రబాలెంలో రైతుల దీక్షలో పాల్గొన్న పవన్.. అక్కడి నుండి మందడం ప్రాంతానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ పోలీసుల అనుమతివ్వలేదు. తుళ్లూరు వెళ్లాలని పవన్‌కు పోలీసులు సూచించారు. దీంతో.. పోలీసులకు జనసేన కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

ప్రస్తుతం సచివాలయంలో సీఎం జగన్ ఉన్నందున మందడానికి అక్కడికి పవన్ వెళ్లడానికి నిరాకరించారు పోలీసులు. ప్రస్తుతం సచివాలయంలో సీఎం జగన్ ఉన్నందున మందడానికి పవన్ వెళ్లేందుకు పోలీసులు నిరాకరించారు. సీఎం వెళ్లిన తరువాతనే అనుమతిస్తామని పవన్‌ను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పవన్ అక్కడే వేచి ఉన్నారు. సీఎం వెళ్లే వరకు అక్కడే ఉంటానని భైటాయించారు. దీంతో ఆప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

అంజనీకుమార్ ఇక్కడ అక్రమంగా ఉంటున్నారు

- కాంగ్రెస్ శాంతి ర్యాలీకి ఎందుకు అనుమతివ్వలేదు
- కాంగ్రెస్ పార్టీ ఏమైనా నిషేధిత సంస్థనా?
- ఎంఐఎం, ఆర్ఎస్ఎస్ సభలకు ఎలా అమతిచ్చారు
- ఫోన్‌లో సంప్రదిస్తే అంజనీకుమార్ అనుచితంగా ప్రవర్తించాడు
- ఆయన ప్రవర్తనపై విచారణ జరపాలని గవర్నర్‌ని కోరాం
- కేసీఆర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తున్నారు
- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి
- గవర్నర్‌ను కలిసిన టి.కాంగ్రెస్ నేతలు.. పోలీసులపై ఫిర్యాదు

హైదరాబాద్, డిసెంబర్31(ఆంఎన్ఎ) : కాంగ్రెస్‌పై పోలీసులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కేసీఆర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తున్నారని టీపీసీసీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉత్తమ్ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు రాష్ట్ర గవర్నర్ తమిళిసైతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్‌పై పోలీసులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, ఎంఐఎం సభలకు అనుమతి ఇచ్చి.. కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీని అడ్డుకున్నారని ఫిర్యాదు చేశారు. అంతేకాదు.. సీపీ అంజనీకుమార్ ఫోన్‌లో తనతో దురుసుగా మాట్లాడారని గవర్నర్‌కు ఉత్తమ్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సీపీ అంజనీ కుమార్ ఇక్కడ అక్రమంగా ఉంటున్నారని గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సీనియర్ నాయకులు వీహెచ్, షబ్బీర్ అలీ, పొన్నాల లక్ష్మయ్య, రేవంత్ రెడ్డి, జానా రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 1885డిసెంబరు 28న కాంగ్రెస్ ఆవిర్భవించిన రోజు అని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ వేడుకలు జరిగాయని, అన్ని రాజధానుల్లో కాంగ్రెస్ జెండా ఎగువేసి, ప్రధాన రహదారులపై శాంతియుత ర్యాలీ చేపట్టాయని అన్నారు. కానీ హైదరాబాద్‌లో మేం వారం క్రితం 28న చేపట్టే శాంతియుత ర్యాలీ కోసం పోలీసులను అనుమతి కోరామని, వాళ్లు వారం తర్వాత పర్మిషన్ ఇవ్వము అని సమాధానం ఇచ్చారని అన్నారు. సరే హైదరాబాద్‌లో ఎక్కడైనా అనుమతి ఇవ్వాలని తిరిగి మేం కోరామని, దానికి జవాబు రాలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. 28న గాంధీభవన్‌లో జెండావిష్కరణ తర్వాత అనుమతి నిరాకరణకు నిరసనగా మా